❖•❖•❖ 26 ❖•❖•❖

# కడపటి మౌఖిక పరీక్ష

*"గనుక పిలాతు – 'నాతో మాటలాడవా? నిన్ను విడుగల చేయుటకు నాకు అధికారము కలదనియు, నిన్ను సిలువ వేయుటకు నాకు అధికారము కలదనియు నీ వెరుగవా?' అని ఆయనతో అనెను. అందుకు యేసు – 'పైనుండి నీకు ఇయ్యబడియుంటేనే తప్ప నా మీద నీకు ఏ అధికారము ఉండదు; అందుచేత నన్ను నీకు అప్పగించినవానికి ఎక్కువ పాపము కలదనెనను" (యోహాను 19:10, 11).*

పిలాతు యేసును కొరడాలతో క్రూరంగా కొట్టించి పరిహాసము చేయుచు అవమానపరచిన కొంతసేపటికి (యోహాను 19:1–3), – రక్త సిక్తమై, ముళ్ల కిరీటము ధరించి, నిస్సత్తువగా నీరసించియున్న – ఆయనను యూదుల యెదుట నిలువబెట్టి, "ఇదిగో, ఈ మనుష్యుడు!" అని ఉద్ఘోషించాడు. యేసు ఉండిన ప్రస్తుత పరిస్థితి యొక్క దయనీయ దృశ్యము వారి సహానుభూతిని ఆకర్షిస్తుందనియు ఆయన విడుదల చేయబడుటకు వారి సమ్మతమును సాధించవచ్చుననియు పిలాతు అనుకొనియుంటాడు. యేసు యొక్క దయనీయమైన రూపము చేత ఏమాత్రమును కదలింపబడక, ప్రధాన యాజకులు, మరియు జనసమూహము మరి ఎక్కువ బలమైన పంతంతోను, బిగ్గరగాను గాఢావేశంతోను, "సిలువవేయుము, సిలువవేయుము!"

అని కేకలువేసారు (యోహాను 19:6ఎ). ఉద్రేకముతో రెచ్చగొట్టబడి, తెగింపుతో కూడిన మాటల్లో పిలాతు, “ఆయనయందు ఏ దోషమును నాకు కనబడలేదు గనుక మీరే ఆయనను తీసికొనిపోయి సిలువవేయుడని వారితో చెప్పెను” (యోహాను 19:6బి). ఇది ఇలా ఉండగా యూదుల తరువాతి కేక పిలాతును నివ్వెరపరచింది. వారు, “మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో చెప్పిరి” (యోహాను 19:7). వారు పిలాతు తీర్పు పరిధిలోనికి రాని - రోమా ప్రభుత్వము చేత ఆదేశింపబడిన యూదుల మహా సభ (సన్హెడ్రిన్ సభ) వ్యవహరించగల మతసంబంధమైన నింద - ఒక వాదమును నివేదించుచుండిరి. సామాన్యంగా, “ఈ సమస్యను మీరు పరిష్కరించవలసినదే. ఈయనను మీ న్యాయస్థానమునకు తీసికొని వెళ్ళుడి. మీతో నాకిక పనిలేదు” అని పిలాతు చెప్పవలసియుండెను.

ఏది ఏమైనా, ఈ క్షణంలో, యేసుకు విరోధముగా మోపబడుచుండిన నిందనుబట్టి పిలాతు అదిరిపోయి ఆ మాటలను అలక్ష్యంచేయుటకు చేసిన ప్రయత్నంలో సహితము అవస్థపడ్డాడు. వారు అంత రూఢిగా చెప్పిన మాటలు విన్నప్పుడు పిలాతు “మరి యెక్కువగా భయపడెను” అని వాక్యభాగము తెలియజెప్పుచున్నది (యోహాను 19:8). యోహాను వ్రాసిన మాటలు “ఆయన భయపడినవాడాయెను” అని అనువదింపబడవలెను కానీ, NEBలో ఉన్నట్లుగా, “ఆయన ఎప్పటి కంటె ఎక్కువగా భయపడిపోయాడు” అని కాదని ఎఫ్.ఎఫ్. బ్రూస్ అనుకొన్నాడు.[1] ఈ కేక పిలాతు హృదయాన్ని ఆయన అంతకు మునుపెన్నడును అనుభవపూర్వకంగా ఎరుగని పెత్తనం చెలాయించు భయంతో నింపివేసిందని బ్రూస్ ఒక సలహా ఇచ్చుచున్నాడు. వారి మాటలు. మరియు పిలాతు యేసులో గమనించిన వినూత్న విషయాలు కలిసి, అతని హృదయంలోనికి భయాన్ని చొప్పించాయి. పిలాతు అంతరంగములో ఉండిన ఆలోచనలేమిటో లేఖనములు మనకు తెలియజెప్పుట లేదు, కానీ “దేవుని కుమారుడు” అను ఘోషణ చేత పిలాతు కలవరము చెందాడను భావము ఇమిడి యున్నట్లగుపించుచున్నది. బహుశ ఆయన ఏదో ఒక రీతిలో దైవికమైనవానిని కొరడాలతో కొట్టించియుండవచ్చునను తలంపు పిలాతుకు వెంటనే తట్టియుండును. ఇతరమైన ఏ ఖైదీయైనను ఎన్నడును ప్రవర్తింపని విధానములో యేసు తానే యుక్తముగా ప్రవర్తించుట ప్రభుత్వాధికారి గమనించాడనుటలో సందేహమేమీ లేదు. యేసుకు విరోధముగా మోపబడిన నేరములు వింతైనవిగాను నిరాధారమైనవై యుండినప్పటికిని ఆయన మాటలు సాటిలేనివియు ఆయన ప్రవర్తన గర్హింపజాలనిదియునై యుండెను.

దైవత్వము గూర్చి గోల చేయబడిన నేరము ఆయన యేసును మరలా ప్రశ్నించుటకు వెంటనే తీర్మానించుకొనునంత తీవ్రంగా పిలాతును బాధించినది. గనుక యూదులకు వ్యతిరేకంగా ఎటువంటి వాదోపవాదము చేయకుండానే, యేసును మరొకసారి వ్యక్తిగతంగా ప్రశ్నించుటకు ప్రేతోర్యమును అధికారమందిరములోనికి తీసికొని వెళ్లాడు. ఇప్పుడు యేసుతో ఒంటరిగా, గావుకేకలు పెట్టుచుండిన జనసమూహామునకు దూరంగా, యేసు గుర్తింపును గూర్చిన మూడు నిత్య సత్యములను ఎదుర్కొన్నాడు.

*అప్పుడప్పుడు మౌనము దాల్చుటకు యేసు ఎన్నుకొనునని పిలాతు మరొక పర్యాయము గ్రహించాడు.* ఆయనను గూర్చి ఏదో ఒక విషయమును అంతగా పట్టించుకొనకపోయి యుండవచ్చునని అనుకొంటూ పిలాతు, “నీవెక్కడనుండి వచ్చితివి?” అని యేసును అడిగాడు

(యోహాను 19:9). యేసు పిలాతుకు సమాధానమేమియు చెప్పలేదు. యేసు మౌనముగా నుండుట పిలాతు ఇదివరకు ఒకసారి గమనించాడు. యూదుల నిరర్థకమైన వాదనలకు యేసు సమాధానమియ్యవలెనని పిలాతు కోరినప్పుడు, యేసు మౌనంగా ఉన్నాడు, గనుక "అధికారి మిక్కిలి ఆశ్చర్యపడెను" (మత్తయి 27:14). హాస్యాస్పదమైనదని స్పష్టముగా తెలియుచుండిన ప్రతి ప్రశ్నకు యేసు సమాధాన మీయకుండెను. తీర్పులోని ఈ సమయంలో, బయలుపర్చబడినది స్పష్టము చేసిన దానికి సమాధానమియ్యవలెనని కోరబడినప్పుడు ఆయన మరలా మౌనంగా ఉన్నాడు.

ఒక విధంగా చూస్తే, యేసు మౌనమే ఒక సమాధానమై యున్నది. ఆయన మౌనమును మించిన గంభీరమైన విషయము ఏదీ లేదు. అది మాటల కంటె మరి ఎక్కువ బిగ్గరగా మాటలాడుచు చెవులు చిల్లులు పడునట్లు చేయు లక్షణమును కలిగియున్నది. ఆయన ఈ ప్రశ్నకు అదివరకే ప్రత్యుత్తరమిచ్చాడు గనుక (యోహాను 18:33–37), మళ్ళీ అదే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు.

యేసు మనకు బోధిస్తాడు, కానీ ఆయన మన హృదయ ద్వారమును బ్రద్దలు చేసి ఆయన చెప్పిన దానిని నమ్మవలెనని మనలను బలవంతం చేయడు. ఆయన రుజువును మనముందుంచును, కానీ దానిని మనము ఒక నిర్ణీత సమయంలోగా అంగీకరించాలి. విశ్వసింప గోరువారెవరికైనాసరే ఆయన సరిపోవునంత రుజువును సమకూర్చును, కానీ ఆయన మనపై బలప్రయోగం చేయడు లేదా మన అభీష్టములకు విరోధంగా మనలను నిర్బంధించడు. సరిపోయినంత రుజువును సమకూర్చిన తరువాత, ఆయన మౌనంగా ఉంటాడు.

*రెండవదిగా, దేవుడు అతనికి అనుగ్రహించిన అధికారము చొప్పున మాత్రమే అతడు యేసుకు తీర్పు తీర్చగలడని పిలాతు కనుగొన్నాడు.* యేసు మౌనంగా ఉండుట వలన పిలాతు చికాకుచెందాడు. గద్దించుచున్న స్వరంతో, పిలాతు, "నాతో మాటలాడవా? నిన్ను విడుదల చేయుటకు నాకు అధికారము కలదనియు, నిన్ను సిలువవేయుటకు నాకు అధికారము కలదనియు నీ వెరుగవా?" అని ఆయనతో అనెను (యోహాను 19:10). దీనికి ప్రతిస్పందనగా, అతనికి దేవుడిచ్చిన అధికారమును మించిన అధికారములేదని యేసు పిలాతుకు గుర్తుచేశాడు. అందుకు యేసు "పైనుండి నీకు ఇయ్యబడియుంటేనే తప్ప నామీద నీకు ఏ అధికారమును ఉండదని" చెప్పాడు (యోహాను 19:11ఎ).

పిలాతు విషయంలో యేసు చెప్పిన ఈ వాస్తవము మనకందరికినీ వర్తిస్తుంది. భూమి మీద నున్న ఏ ఒక్కరికైనను పైనుండి ఈయబడిన అధికారము తప్ప ఏ అధికారమును లేదు. ఈ లోకములో ఏదియును ఉన్నట్టుండి ఊరకనే జరుగదు. దేవుడు దానిని జరిగిస్తాడు లేదా అది జరుగునట్లు అనుమతిస్తాడు. మనము ప్రస్తుతమున్న చోట్లలో దేవుడు మనలను ఉంచాడు లేదా మనమున్న చోట ఉండునట్లు అనుమతించాడు.

పిలాతు యేసు యొక్క భౌతిక ముఖాన్ని చూస్తూ ఆయనకు తీర్పు తీర్చాడు. దేవుడు ఆయనకు ఆ పదవిని మరియు తరుణమునిచ్చాడు, గనుక పిలాతు అట్టి పదవిని మరియు తరుణమును ఉపయోగించుకొన్న విధానం గూర్చి బాధ్యతాయతమైన సమాధానం చెప్పాల్సివుంటుంది. నీకును నాకును వెవ్వేరు పదవులున్నాయి, కానీ ఈ సత్యము మనకు కూడ అన్వయిస్తుంది. దేవుడు తన కటాక్షము చొప్పున, ప్రస్తుతము మనమున్న చోట ఆయనే

మనలనుంచాడు. యేసుకు సంబంధించిన ఎంపిక మనమున్న చోటనే, మనము కలిగియున్న దానితోనే, మరియు దేవుడిచ్చిన అధికారము చొప్పుననే చేసుకొనవలెను.

*మూడవదిగా, కొన్ని పాపములు ఇతరమైన వాటి కంటె ఘోరమైనవని పిలాతు తెలుసుకొన్నాడు.* యేసు పిలాతుతో తన సంభాషణను కొనసాగిస్తూ, "అందుచేత నన్ను నీకు అప్పగించినవానికి ఎక్కువ పాపము కలదు" అని అన్నాడు (యోహాను 19:11బి). నిస్సందేహంగా, యేసు, ఆయనను పిలాతు నొద్దకు పంపించిన కయప గూర్చి చెప్పుచుండెను. ప్రధానయాజకుడు యేసును తృణీకరించి ఆయన సిలువ మరణము నొందవలెనని ఆశించాడు గనుక ఆయన పాపము గొప్పదై యుండెను. పిలాతు యేసు నిర్దోషత్వమును గమనించాడు గనుక – దాని గూర్చి దుర్బలమైన సంకల్పము కలిగియుండినప్పటికిని – యేసు కేసును కొట్టివేయుటకు ప్రయత్నించుచుండెను. పిలాతు యేసు యెడల చేయవలసినదంతా చేయలేదు, కానీ యేసు నిర్దోషియని ముమ్మారు ప్రకటించాడు.

ఒకరు దేవుని పాపరహితుడైన కుమారుని చూచి కూడ, రుజువును ప్రక్కకు నెట్టివేసి, ఆయనను ఖండించినప్పుడు, అతడు పాపములన్నిటిలోకెల్లా ఘోరాతి ఘోరమైన పాపము చేసినవాడగును. ఆయన యేసును ఏమి చేయాలో ఎటుతోచక యుండిన పరిస్థితిలో, పిలాతు పాపము చేశాడు; కానీ ఆయన కయప చేసినట్లు పాపము చేయలేదు. పిలాతు ఆయన అజ్ఞానము మరియు భయమునుబట్టి, సత్యమునకు విరోధముగా పాపము చేశాడు; కాని ఆయన చేసినట్లు పాపము చేయలేదు. కయప, ఆయన యేసును గూర్చి ఎరిగియుండెనని యు, యేసును నాశనము చేయవలెనని ఆశించాడు.

మనము విన్న సత్యము దృష్ట్యా మనము తీర్పు తీర్చబడుదుమనుటలో కొంత సందేహమున్నట్లు అగుపించుచున్నది. మనలో బైబిలు సంబంధమైన బోధలు ఉపదేశములు ఎక్కువగా విన్నవారు తెలిసికొనియున్నవారు మనము ఎదుర్కొనిన, గుర్తించి యోచించిన, మరియు లోబడవలెనని దేవుడు తన కటాక్షము చొప్పున అడిగిన సత్యము చేత తీర్పు తీర్చబడుదుము.

పిలాతు యేసుతో కూడ సమయము గడిపిన ఈ కడపటి ముఖాముఖి జీవితములో ఎదురయ్యే అతి గొప్ప సవాళ్లను మనకు నివేదించుచున్నది. యేసును గూర్చిన నిర్ణయము తీసికొనవలసి వచ్చినప్పుడు, మనము ప్రతి ఒక్కరము మూడు సరిహద్దులు కలిగియున్న ఒక అంశము గూర్చి నిర్ణయించుకొనవలెను: మొదటిది దేవుడు మనకిచ్చిన అధికారము, మరొకటి అనుగ్రహింపబడిన తరుణము యొక్క పరిమాణం, మరియు మూడవది బలవంతము చేయని సందర్భ స్ఫూర్తి. దేవుడు మనకిచ్చిన పదవి మరియు పరిస్థితుల పరిమితిలో మన వ్యక్తిగత నిర్ణయములు తీసుకొనవలెను. మనకివ్వబడిన తరుణములు, అవి పెద్దవైనా చిన్నవైనా, వాటితో మనము మన శాయశక్తులా చేయగలినంతా చేయుటకు ఎన్నుకొందాము. అలా చేయనట్లయితే తీర్మానములు చేసుకొను రోజు దాటిపోతుంది, యేసు మౌనంగా ఉండి పోతాడు.

❖◆❖◆❖

*"అయ్యో కొరాజీనా, అయ్యో బేత్సయిదా, మీ మధ్యను చేయబడిన అద్భుతములు తూరు సీదోను పట్టణములలో చేయబడిన యెడల ఆ పట్టణములవారు పూర్వమే గోనెపట్ట కట్టుకొని బూడిదె వేసికొని మారుమనస్సు పొందియుందురు. విమర్శదినమందు మీ గతికంటె తూరు సీదోను పట్టణములవారి గతి*

*ఓర్వతగినదై యుండునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 11:21, 22).*

*"ఇదిగో, నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతనియొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము" (ప్రకటన 3:20).*

---

సూచన

[1]F. F. Bruce, *The Gospel of John* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1983), 361.